క్లుప్తంగా

అండర్–19 క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రికి చెందిన అతికారి జయంత్ కృష్ణ, తన్వీర్ జమాల్, చెన్నకేశవరెడ్డి అనంతపురంలో జరిగిన ప్రాబబుల్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరచి అండర్–19 జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు మే 28 నుంచి జూన్ 3 వరకూ జిల్లా కేంద్రంలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ అండర్–19 అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిని ఆర్డీటీ ఏటీఎల్ లలితమ్మ, సీనియర్ క్రికెట్ కోచ్ సాధిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందించారు.

ఘనంగా థామస్ మన్రో జయంతి



మన్రో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోటలో సోమవారం దత్త మండలాల కలెక్టర్ థామస్ మన్రో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మన్రో చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు రమేష్, కాశీరావు, చిరంజీవి, కోటీశ్వరరావు, గురు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తేనే గరిష్ట వేతనం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యాడికి: ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. మండలంలోని మోడల్ స్కూల్ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పనులకు జాబ్ కార్డు ఉన్న వారు మాత్రమే హాజరు కావాలన్నారు. పని ప్రదేశంలో కూలీల కోసం తప్పనిసరిగా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం తొందరగా పని ప్రారంభించి 11 గంటలకు ముగించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ ధనుంజయ, కూలీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మాస్టర్ ట్రైనర్ రంగమ్మ ఆధ్వర్యంలో వంట సిబ్బంది, హెల్పర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వంట పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామగోవింద్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన చంద్రమౌళి


గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లిలో రెండేళ్ల చంద్రమౌళిపై సోమవారం వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. వివరాలు.. గ్రామానికి చెందిన గాజుల నాగరాజు కుమారుడు చంద్రమౌళి తన ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. బాలుడి మొహం, కాళ్లు, చేతులకు గాయాలు కాగా కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఇటీవల గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికమైందని.. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా బెట్టింగ్



శింగనమల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గెలుపు కోసం నువ్వా– నేనా? అన్నట్టు సాగిన పోరులో విజయం సాధించేది ఎవరో అంటూ సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడే కొద్దీ టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలపై జోరుగా పందేలు జరుగుతున్నాయి. ఈ పందేలు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములతో పాటు మండలాల వారీగా, మండలంలో పోలింగ్ కేంద్రాల్లో మెజార్టీపై సైతం సాగుతున్నాయి.

- వైఎస్సార్‌సీపీ విజయంపై భారీగా పందేలు
- నాయకుల్లో టెన్షన్..టెన్షన్



గార్లదిన్నె: పోలింగ్ ముగిశాక అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో నాయకులు, ప్రముఖులు సైతం పందెం కాస్తున్నారని తెలుస్తోంది. శింగనమలలో ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు, టీడీపీ అభ్యర్థి శ్రావణశ్రీ మధ్య పోటీ నడిచింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని.. లేదు టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆయా పార్టీల నాయకులు భారీగా బెట్టింగ్ పెడుతున్నారు. అంతే కాకుండా వైఎస్సార్‌సీపీకి ఇన్నే సీట్లు వస్తాయని, కూటమికి ఇన్ని సీట్లు వస్తాయని బెట్టింగులు కడుతున్నారు. గతం కంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు మెజార్టీ పెరుగుతుందా? తగ్గుతుందా అనే వాటిపై కూడా జోరుగా పందేలు కాస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల్లో రచ్చబండ, టీ హోటళ్లు, బస్టాండ్‌ల వద్ద ఇద్దరు, ముగ్గురు కలిస్తే ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకోవడం విశేషం. ప్రధానంగా జిల్లా స్థాయిలో ఎన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ గెలుస్తుందన్న వాటిపై పందేలు కడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వల్ల మహిళలు, వృద్ధులు, ప్రజలు అధిక శాతం మంది లబ్ధి పొందడంతో వారంతా ఓటింగ్‌లో పాల్గొని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీ నేతలు సవాల్ విసురుతున్నారు. శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా రూ.కోట్లలో బెట్టింగ్ వేసినట్లు తెలుస్తోంది. మొదట్లో ఒకటికి ఒకటి అంటూ మొదలైన పందేలు, కౌంటింగ్ సమయం దగ్గరకు వచ్చేసరికి ఒకటికి ఒకటిన్నర అంటూ పందెం వేస్తున్నట్లు తెలస్తోంది. దీంతో నియోజకవర్గంలో బెట్టింగ్ వ్యవహారం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతుంది. గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ ఉంటుందని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు గెలుస్తారని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం మండలాల్లో టీడీపీకే మెజార్టీ వస్తుందని ఆ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

2019లో వైఎస్సార్‌సీపీ హవా

2019 ఎన్నికల్లో గార్లదిన్నె మండలంలో 8,305 ఓటు, శింగనమల–6,042, బుక్కరాయసముద్రం – 6,355, నార్పల–8,526, పుట్లూరు – 7,536, యల్లనూరులో 9,476ఓట్లు మెజార్టీ వచ్చింది. అలాగే నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ వచ్చింది. ఈసారి కూడా అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ వస్తుందని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల ఎమ్మెల్యేగా వీరాంజనేయులు గెలవడంతో పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని జోస్యం చెబుతున్నారు. టీడీపీ పింఛన్ ఆపడం, వలంటీర్లను తొలగిస్తామ నడం, ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పడంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఆగ్రహం, అమలు చేయలేని హామీలను ప్రజలు నమ్మకపోవడం, బీజేపీతో కలిసినందుకు ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు అంటూ విశ్లేషకులు చర్చించుకోవడం విశేషం.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



మేడిమాకులపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని మేడిమాకులపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నాయకుల ఇళ్లు, పాత కేసుల్లో నిందితులుగా ఉన్నవారి ఇళ్లు, కల్లాల్లో సోదాలు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా ప్రజలకు ఇబ్బందులకు గురి చేసినా , పాత కక్షలు మనస్సుల్లో పెట్టుకొని గొడవలకు పాల్పడినా సహించేది లేదన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ప్రేరేపించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘర్షణ పడితే కేసుల నమోదు



కల్లుమడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శింగనమల: కౌంటింగ్ రోజు గ్రామాల్లో ఘర్షణలు పడిన, టపాసులు కాల్చినా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని శింగనమల, కల్లుమడి, ఇరువెందల గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కౌటింగ్ రోజు ఊరేగింపులు, బాణ సంచా కాల్చడం వంటివి చేయవద్దన్నారు. ఎవరు గెలిచిన ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని, ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరం, హెడ్‌కానిస్టేబుల్ బాషా, అంజన్‌రెడ్డి, సిబ్బంది సాయి, నరేష్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ తోడ్పాటు



శింగనమలలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా సంచాలకురాలు షమా



గార్లదిన్నెలో దివ్యాంగుల గుర్తింపు కోసం సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీలు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు తోడ్పాటు అందించేలా చర్యలు చేపడుతోందని జిల్లా సహిత విద్యా సంచాలకురాలు షమా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఈఓలు నవిద, లింగానాయక్ సమన్వయంతో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు వికలాంగ విద్యార్థులను గుర్తించేలా ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. సర్వేను ఆమె పర్యవేక్షించారు. ముందుగా ఎంఈఓ కార్యాలయంలో ఐఈఆర్‌పీ నుంచి విద్యార్థులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షమా మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా చదువుతో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ, ఫిజియోథెరపీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఆది నారాయణ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శారీరక, మానసిక దివ్యాంగుల గుర్తింపు కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్‌టీలు నాగరత్న, సింధు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో 8 సంవత్సరాల్లోపు ఉన్న దివ్యాంగుల గుర్తింపు కోసం సర్వే చేశారు. ఐఈఆర్‌టీలు మాట్లాడుతూ గ్రామాల్లోని శారీరక, మానసిక దివ్యాంగులను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్నామన్నారు. అలాగే దివ్యాంగులకు ప్రతి గురువారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ ఉచితంగా చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 10 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు. భవిత కేంద్రాలను దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మరో ఐదుగురి అరెస్టు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి అల్లర్లకు సంబంధించి మరో ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన టీడీపీ వర్గీయులు పేరం రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటాంపల్లెకు చెందిన షేక్ అబ్దుల్ షాకీర్, పెద్దపొలమడకు చెందిన నాగేంద్రగౌడ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాడికి అప్‌గ్రేడ్ సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం సీఐ సిబ్బందితో కలిసి మండలంలోని వేములపాడులో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించి శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించాలని సూచించారు. అందరూ కలసిమెలసి ఉండాలని కోరారు. సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

గార్లదిన్నె: జూన్ 4న సార్వత్రిక ఎన్నిల కౌంటింగ్ సందర్భంగా మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. సోమ వారం ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు,అల్లర్లు,గొడవలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని,కఠిన చర్యలు తప్పవన్నారు.అలాగే ప్రశాంతమైన గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే శిక్షార్హులవుతారన్నారు. అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు.

458 మంది బైండోవర్



సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: మండల వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ మొత్తం 458 మందిని బైండోవర్ చేశామని సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, వివిధ కేసుల్లో నిందితులు, అల్లర్లు చేస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయించామన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ముందు మరిన్ని బైండోవర్లు చేయిస్తామన్నారు. కౌంటింగ్ రోజు ప్రశాంతతకు భంగం కలిగించినా, అల్లర్లు, ఘర్షణలకు దిగినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నాయన్నారు.

పామిడిలో 45 మంది..

పామిడి: కౌటింగ్ నేపథ్యంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి 45 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. కౌటింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పలువురిని అదుపులోనికి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు సారథ్యంలో అదుపులోనికి తీసుకున్నవారిని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలివ్వాలి



గుంతకల్లులో ఆర్ఐ రాజేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్/తాడిపత్రి టౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/పుట్లూరు: ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలని కోరుతూ సోమవారం తాడిపత్రి వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అలాగే రైతులకు బ్యాంకర్లు సకాలయంలో రుణాలు అందజేయాలని సీపీఐ నాయకులు కోరారు. అలాగే పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరుతూ సీపీఎం, సీపీఐ నాయకులు సోమవారం వేర్వేరుగా గుంతకల్లు, గుత్తి, పుట్లూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం



పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రనాథ్ తెలిపారు. తొలిరోజు 1 నుంచి 12,000 ర్యాంకు వరకూ 29 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించామని సిస్టమ్ అడ్మిన్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం 12,001 నుంచి 27,000 ర్యాంకు వరకూ ధ్రువీకరణ ప్రత్రాలు పరిశీలిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ర్యాంకుల వారిగా జూన్ 3 వరకూ ధ్రువీకరణ పత్రాలు పరిశీలన, మే 31 నుంచి జూన్ 5 వరకూ వెబ్ ఆప్షన్స్ నమోదు ఉంటుందన్నారు, జూన్ 7న సీట్ల కేటాయిస్తామన్నారు. ఎస్టీ విద్యార్థులకు అనంతపురంలో, ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు విజయవాడలో సూచించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ 9493773778 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మిరప రైతులకు నేడు అవగాహన

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మిరప రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ మల్లీశ్వరి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రైతులు ఉదయం 10 గంటలకు రైతు భరోసా కేంద్రం వద్దకు రావాలని సూచించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని మిరప పంట సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కూలిన చెట్టును తొలగించండి



రోడ్డుపై కూలిపోయిన చెట్టు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో మూడు రోజులు క్రితం భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో ఓ చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలింది. అయితే ఇంత వరకూ చెట్టును తొలగించలేదు. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విజయోత్సవాలు చేయొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ హేమాద్రి

పుట్లూరు: ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు చేయవద్దని ఎస్ఐ హేమాద్రి సూచించారు. సోమవారం ఆయన మండలంలోని ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, కోమటికుంట్ల తదితర గ్రామాలకు చెందిన 22 మందిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం బాణాసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

4,182 మందికి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

గుత్తి: గుత్తి వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి మూడు రోజుల్లో 4,182 మంది రైతులకు 3,699 క్వింటాళ్ల విత్తన వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశామని ఏడీఏ వెంకటరాముడు తెలిపారు. గుత్తిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 శాతం సబ్సిడీతో విత్తకాయలు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గుత్తి వ్యవసాయ డివిజన్ పరిధిలోని గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, శింగనమల, యాడికి మండలాల రైతులకు విత్తన వేరుశగన పంపిణీ చేశామన్నారు. 8,828 మంది రైతులు ఆర్బీకేల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

పుట్లూరు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి పన్ను 100 శాతం వసూలు చేయాలని ఆయన సూచించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

గార్లదిన్నె: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ సోమశేఖర్ సూచించారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ పొలాలను వాలుకు అడ్డంగా దున్నాలన్నారు. అలా చేయడం వారా భూమి కోతకు గురికాకుండా ఉంటుందన్నారు. లో దుక్కుల వల్ల భూమి లోపల పొరలు బయట పడి , పొలం సారవంతం అవుతుందన్నారు.

బీటీపీకి చేరుతున్న వరద



భైరవానితిప్ప ప్రాజెక్టుకు వచ్చిన వరద

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువున ఉన్న కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వేదావతి హగరి ద్వారా బీటీపీ రిజర్వాయర్‌కు సోమవారం సాయంత్రానికి 1,643 అడుగులకు నీరు చేరింది. రోజుకు అడుగు చొప్పున వరద నీరు వచ్చి చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ గట్టుపై జలవనరుల శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



36 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం 1987–88 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయుడు 91 సంవత్సరాలు నిండిన వెంకటరమణప్పను సన్మానించారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో రూ.1.57 లక్షల వ్యయంతో విద్యార్థుల సౌకర్యార్థం కోసం సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లక్ష్మన్న రమేష్, షఫీ ఉల్లాఖాన్, రామాంజినేయులు, భాస్కర్, ఆది నారాయణ, వెంకటేష్, రామేశ్వరరెడ్డి, నర్మద, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.